

నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య విగ్రహాలు





శోభాయాత్రలో భారీ గణనాథులు



చిలమత్తూరు మండలం సడ్లపల్లిలో...



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వినాయకా.. సెలవిక !

- 'పురం'లో వైభవంగా గణేశ్ నిమజ్జనం
- ప్రశాంతంగా పూర్తవడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు
- పలు మండలాల్లోనూ పూర్తయిన ఉత్సవాలు

సాక్షిబృందం: హిందూపురం పట్టణంలో ఆదివారం నిర్వహించిన వినాయక నిమజ్జనం అత్యంత వైభవంగా సాగింది. గణపతి బప్పా మోరియా.. మంగళ మూర్తి మోరియా... జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అన్న నినాదాలు మార్మోగాయి. డప్పు వాయిద్యాలు, డీజే డ్యాన్సులతో యువత కేరింతలు కొట్టారు. అన్ని విగ్రహాలు అంబేడ్కర్ సర్కిల్ మీదుగా గుడ్డం కోనేరుకు తరలివెళ్లాయి. ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు నిమజ్జనంలో పాల్గొని వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గుడ్డం కోనేరు వద్ద కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తో పాటు సిబ్బంది నిమజ్జనోత్సవాన్ని పర్యవేక్షించారు. సోమవారం తెల్లవారుజాము వరకూ నిమజ్జనం కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా నిమజ్జనోత్సవం పూర్తవడంతో పోలీసులు, వినాయక ఉత్సవ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. వివిధ మండలాల్లోనూ గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.



డ్యాన్స్ చేస్తున్న యువతులు



గుడ్డం కోనేరులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



వెయ్.. చిందెయ్



గుడ్డం కోనేరులో గణేష్ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



వినాయక విగ్రహాలతో చిన్నారులు



రొద్దం: వినాయక విగ్రహం వద్ద హోమాలు నిర్వహిస్తున్న పండితులు



లేపాక్షి: సడ్లపల్లిలో నిమజ్జన సందడి



అమరాపురం: హలుకూరులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



దప్పు శబ్దాలకు డ్యాన్స్ వేస్తున్న యువకులు

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఉచితంగా మందులు ఇస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా చిత్రదుర్గం నుంచి వచ్చిన స్త్రీల వ్యాధి నిపుణులు జ్యోతి 90 మంది రోగులను పరీక్షించి వారికి తగిన సలహాలు, సూచనలిచ్చారు. అలాగే పావగడ నుంచి వచ్చిన శస్త్ర చికిత్స నిపుణుడు ఓంకార్‌నాయక్ 60 మంది రోగులను పరీక్షించారు. అనంతరం అవసరమైన వారికి ఆరోగ్య మైత్రి కూటమి సభ్యులు రూ.30 వేలు విలువ చేసే మందులను రోగులకు ఉచితంగా అందజేశారు.

18 మందిపై కేసు నమోదు

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గ్రామంలో ఈ నెల 20న వినాయక నిమజ్జనం సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మాల సుజాతమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చిలమత్తూరులో విస్తారంగా వర్షాలు



నల్లరాళ్లపల్లి పాఠశాల ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

చిలమత్తూరు: మండలంలో వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి ఎడతెరపిలేని వర్షం కురిసింది. వర్షం ధాటికి అక్కడక్కడా గుంతల్లో, చెరువుల్లో నీరు చేరింది. నల్లరాళ్లపల్లి గ్రామంలో భారీ వర్షం కురవడంతో ప్రభుత్వ పాఠశాలలో నీళ్లు చేరాయి. దీనికి తోడు పాఠశాల కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను కౌన్సిలర్ సుభద్ర, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర ప్రారంభించారు. మడకశిర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ వైఎస్సార్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని, ఈమేరకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నారాయణప్ప, హబీబ్, అంజి, నాగరాజు, పూజారి రామాంజి, మునవర్, సోమనాథరెడ్డి, కార్తిక్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి



మొక్క నాటుతున్న దృశ్యం

హిందూపురం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల (బ్రిడ్జ్) స్కూల్ ఆవరణంలో ఆదివారం రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామ దేవత కొల్లాపురి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వివిధ పూజలను నిర్వహించారు. రకాల పూజలను అర్చకులు శివప్ప చేశారు. సాయంకాలం శాంతి, వాస్తు, గణ హోమాలను అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. సోమవారం తెల్లవారుజామున జలధి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నిందితులను అరెస్టు చేసి న్యాయం చేయండి



మాట్లాడుతున్న బాధితురాలు రూప

పావగడ: బైక్ ప్రమాదంలో తన భర్త గోవిందప్ప మృతి చెంది రెండు నెలలు కావస్తున్నా నిందితులను ఆచూకీ కనుగొనడంలో స్థానిక పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మృతుని భార్య రూప ఆరోపించింది. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాలూకాలోని సీకే పురం గ్రామంలో తాము వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామని చెప్పారు. వ్యవసాయ బోరు చెడి పోవడంతో మెకానిక్‌కు చెల్లించాల్సిన డబ్బుల కోసం స్వగ్రామం వీర్లగొంది గ్రామానికి ఈ ఏడాది జూలై 1న తన భర్త గోవిందప్ప ద్విచక్ర వాహనంలో వెళ్తూ మార్గ మధ్యంలోని కృష్ణగిరి గేటు వద్ద ఓ ఈచర్ వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. అదేరోజు తన తండ్రి దాసప్ప స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, అయితే ఇంత వరకు పోలీసులు నిందితుడి జాడ కనిపెట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే నిందితుడిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు.

కనకదాస విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కురబ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు

గోరంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారి ముఖద్వారం పక్కన మండల కురబ సంఘం ఆధ్వర్యంలో కనకదాస విగ్రహ ఏర్పాటుకు జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్ ఆదివారం భూమి పూజ చేశారు. కురబ కులస్తుల ఆరాధ్యదైవం కనకదాస విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని గ్రామ పంచాయతీకి ఆ సంఘం నాయకులు విన్నవించుకొన్నారు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు, పాలక మండలి సభ్యులు మండల పరిషత్ కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారి ముఖద్వారం పక్కన స్థలం కేటాయించారు. ఆదివారం గ్రామ పంచాయతీ కేటాయించిన స్థలంలో కురబ సంఘం నాయకులు , స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కురబ రామలక్ష్మమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, సర్పంచ్ సరోజబాయి తదితరులు పాల్గొన్నారు.

• అపూర్వ సమ్మేళనం

రొళ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను ప్రతి పూర్వ విద్యార్థి కూడా గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎవరువరు ఏఏ రంగాల్లో స్థిర పడ్డారు? వివాహం, కుటుంబ విషయాలను చర్చించారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రొళ్లలో కలిసిన పూర్వ విద్యార్థులు

విధులకు డుమ్మా కొట్టిన వైద్యులు

- వైద్యం అందక క్యాన్సర్ రోగి అవస్థ



పెనుకొండ సర్వజనాస్పత్రి వద్ద రోదిస్తున్న రామక్క

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సకాలంలో వైద్యం అందక క్యాన్సర్ రోగి నరక వేదన అనుభవించింది. 8 మంది వైద్యులు ఉండగా ఒక్కరు మినహా మిగతా వారంతా డుమ్మాకొట్టడంతో బాధితురాలితో పాటు వారి కుటుం సభ్యులు విలవిలలాడారు. వివరాలు... పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురంకు చెందిన రామక్క క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమెకు రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉండగా అనంతపురం ఆస్పత్రి వైద్యులు పెనుకొండ ఆస్పత్రిలో రక్తం ఎక్కించుకోవాలని సూచించారు. దీంతో బాధితురాలితో పాటు వారి కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చారు. అక్కడ వైద్యులు ఎవరూ కనిపించలేదు. అర్జెంటుగా రక్తం ఎక్కించాలని కింది స్థాయి ఉద్యోగులను వారు ప్రాధేయపడ్డారు. డాక్టర్లు లేరని రక్తం ఎక్కించడం కష్టమని వారు చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. చేసేదిలేక బాధితురాలిని అనంతపురం తరలించారు. విధులకు డుమ్మాకొట్టి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సహకార సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖరరెడ్డి



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని బెల్లిబట్లు గ్రామానికి చెందిన పాల ఉత్పత్తి సహకార సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గోపాల్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పాల సహకార సంఘం కార్యాలయంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రెండు స్థానాలకు ఇద్దరు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రాఘవేంద్ర ప్రకటించారు. వారి ఎన్నిక పట్ల స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితర కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించారు. ఈ సంఘంలో మొత్తం 450 మంది వాటాదారులు ఉండగా 120 మంది పాల ఉత్పత్తిదారులు ఉన్నారు. వారిలో 48 మంది ఓటర్లు ఉన్నారు. కాగా నూతన అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి పాల ఉత్పత్తి సహకార సంఘానికి వరుసగా మూడు పర్యాయాలు అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారు. తుమకూరు జిల్లా పాల ఉత్పత్తి సంఘం డైరెక్టర్ స్థానానికి పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన హేమావతి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. టీడీ పల్లి రంగనాథప్ప, కొత్తపాళ్యం వినాయక కమిటీ సభ్యులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి స్వామి వారి ఎదుట నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులను సహపంక్తిగా కూర్చోబెట్టి అన్నదానం చేశారు.

సర్దిచెప్పేందుకు వెళ్లిన యువకుడిపై దాడి



గాయపడిన తిమ్మయ్య

రొద్దం: మండల పరిధిలోని ఎం కొత్తపల్లి గ్రామంలో వడుసులప్ప కుటుంబ సభ్యులు ఘర్షణ పడుతుండగా విడిపించడానికి వెళ్లిన ఓ యువకుడిపై దాడి జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు... కొత్తపల్లికి చెందిన వడుసులప్ప కుటుంబ సభ్యులు కుటుంబ వ్యవహారాలకు సంబంధించి ఆదివారం ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో తిమ్మయ్య అనే యువకుడు ఎందుకు పడతారని సర్దిచెప్పేందుకు వెళ్లాడు. ఈ నేపథ్యంలోనే వడుసులప్ప... తిమ్మయ్యపై దాడి చేయడంతో కన్నుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ వ్యవహారంపై తమకు ఫిర్యాదు అందిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ కేబీ నాగరాజు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాద అందించి ఆశీర్వదించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220723, 9705346587

9010200238, 9912220726